క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి సాయం



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతి చెందిన చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈమేరకు రూ.70 వేలను బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. హసన్‌పర్తి మండల కేంద్రం అంబేడ్కర్ నగర్‌కు చెందిన మేకల రాజు ఇటీవల మృతి చెందాడు. 1998 – 99లో ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన రాజు స్నేహితులు అండగా నిలిచారు. మృతుడి పిల్లలకు ఉచిత విద్య అందిస్తానని ఎన్‌ఎస్‌ఎం పాఠశాల కరస్పాండెంట్ వలస జ్ఞానేశ్వర్ ప్రకటించారు. కార్యక్రమంలో స్నేహితులు స్వరూప, మోహన్, ఉమాశంకర్, సతీష్, యుగంధర్, చెన్నూరి రవి, భిక్షపతి, నాగరాజు పాల్గొన్నారు.

19న ఆల్ ట్రేడ్ యూనియన్ సదస్సు

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 19న వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో ఆల్ ట్రేడ్ యూనియన్స్ సదస్సు నిర్వహించనున్నట్లు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు బోగి సురేష్, ముక్కెర రామస్వామి కార్యదర్శి గన్నారపు రమేష్ తెలిపారు. సదస్సుకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేత పుల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'గోల్డెన్ ఓక్'ను సీజ్ చేయాలి

రామన్నపేట: తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల వేడుక రోజు సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికీ తరగతులు నిర్వహిస్తున్న గోల్డెన్ ఓక్ స్కూల్‌ను సీజ్ చేసి దాని గుర్తింపు రద్దు చేయాలని బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. నిబంధనలను తుంగలో తొక్కడాన్ని నిరసిస్తూ ములుగు రోడ్డులోని పాఠశాలలో బీఎస్‌ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

వ్యర్థాల తొలగింపు




హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ – కాజీపేట మార్గమధ్యలోని వంద ఫీట్ల రోడ్డు 56వ డివిజన్‌లో మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈమేరకు స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్ స్పందించి జేసీబీ సాయంతో కాల్వలను శుభ్రం చేయించారు. కాగా, నగరంలోని గోపాపురం క్రాస్ వద్ద పైపులైన్‌లు దెబ్బతిన్నడంతో మరమ్మతుల కోసం గుంత తవ్వారు. అయితే, మరమ్మతులు చేశాక ఆ గుంతను అలాగే వదిలేయడంతో నల్లాల ద్వారా మురుగునీరు వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

19వ డివిజన్‌లో అభివృద్ధి శూన్యం



కాశిబుగ్గ: బీఆర్‌ఎస్ పాలనలో గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్‌లో అభివృద్ధి శూన్యమని బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మంతెన అమరీష్ అన్నారు. ఓ సిటీ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అమరీష్ మాట్లాడుతూ రూ.3,800 కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ గొప్పలు చెప్పుకోవడం తప్ప ఎక్కడా అభివృద్ధి కనపడటం లేదని విమర్శించారు. కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 50 లక్షల నిధులు కేటాయిస్తామని చెప్పి ఇంతవరకు ఎందుకు కేటాయించలేదో చెప్పాలని ప్రశ్నించారు. వివేకానందకాలనీలో కొత్త కమ్యూనిటీ హాల్ నిర్మించలేదని ఎద్దేవాచేశారు. సమావేశంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పులిచేరు ఉపేందర్, నాయకులు ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



హన్మకొండ చౌరస్తా: సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా కోరారు. భూపాలపల్లి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పసుల విజయ్‌తో పాటు పది కుటుంబాలు లిబరేషన్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రొయ్యల రాజు, మారపల్లి మల్లేష్, గోల్కొండ కుమార్, దామెర సుదర్శన్, అజయ, దినేష్, శ్రీకాంత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో సమస్యల తిష్ట

- జాడలేని సీసీ రోడ్లు
- కానరాని డ్రెయినేజీలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ గణేష్‌నగర్‌లోని 5, 6, 7 కాలనీల్లో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మామూలు సందర్భాల్లోనే సమస్యలతో సహవాసం చేసే ప్రజలు.. వర్షాకాలం వచ్చిందంటే పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. కాలనీలోని రోడ్లపై ఏర్పడిన గుంతలు, ఖాళీ ప్రదేశాల్లో వరద నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. గణేష్‌నగర్‌లోని సమస్యలను ప్రజాప్రతినిధులతోపాటు కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా పరిష్కరించడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాడలేని సీసీ రోడ్లు

గణేష్‌నగర్.. కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. కాలనీలో సీసీ రోడ్ల జాడే లేదు. మట్టిరోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేరు. రెండు నియోజకవర్గాలను ఆనుకుని ఉన్న కారణంగానే ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కానరాని డ్రెయినేజీలు

కాలనీలో డ్రెయినేజీలు నిర్మించడంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సైడు కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటి కారణంగా వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నామని వారు చెబుతున్నారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు బెడద అధికమై జ్వరాల బారినపడే అవకాశముందని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గణేష్‌నగర్‌పై దృష్టి సారించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



గణేష్‌నగర్‌లో బురదమయంగా మారిన రోడ్డు



రోడ్డుపైనే నిలిచిన నీరు



ఖాళీ ప్రదేశంలో నిలిచిన వర్షపు నీరు

సీసీ రోడ్లు నిర్మించాలి



కాలనీలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లపై నీరు నిలవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బండారి రవిబాబు

దుర్వాసన వస్తోంది



గణేష్‌నగర్‌లో సైడు కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దాంతో దుర్వాసన వస్తోంది. గుంతల్లో వరద నీరు చేరి నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి.

– సుతారి రాజు

కాంగ్రెస్ పాలనలో పవర్ హాలీడేలు

వరంగల్: కాంగ్రెస్ పాలనలో పవర్ హాలీడేలు.. క్రాప్ హాలీడేలు ఉండేవని బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. రైతులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తీరును నిరసిస్తూ 3, 14వ డివిజన్ల రైతులతో కొత్తపేట రైతు వేదికలో వరంగల్ మండల రైతుబంధు కోఆర్డినేటర్ బుద్దె శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండి.. రైతుల కంట కన్నీరు కారిందని గుర్తుచేశారు. తెచ్చిన అప్పులకు మిత్తీలు కట్టలేక చాలామంది అన్నదాతల గుండెలు ఆగిపోయాయని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి రంగానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇచ్చి అనేక విప్లవాత్మక పథకాలను తీసుకువచ్చారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జన్ను షీబారాణి, తూర్పాటి సులోచన, పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికిష్ణ, డివిజన్ ప్రెసిడెంట్ నేరెళ్ల రాజు, నరసింహ, మాజీ కార్పొరేటర్ వీర భిక్షపతి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

బాధిత కుటుంబానికి పరామర్శ

గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ కొత్తపేట గ్రామానికి చెందిన ఆకుల లక్ష్మి ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సోమవారం పరామర్శించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



ఆందోళన చేస్తున్న మహిళలు

రామన్నపేట: పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు విజయ డిమాండ్ చేశారు. రామన్నపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట గాంధీ బొమ్మ నుంచి కుంటి భద్రయ్య గుడి వరకు ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పెట్రోల్ రూ.50 నుంచి 110కి, డీజిల్ ధర రూ.40 నుంచి 100కి పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, సిలిండర్ ధరను రూ. 400 నుంచి రూ.1200కి పెంచారని తెలిపారు. దాంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

రైతు దీక్షను విజయవంతం చేయండి

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిర్వహించే రైతు దీక్షకు బీజేపీ నేతలు, కిసాన్ మోర్చా నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు జరుగుతున్న అన్యాయాలపై బీజేపీ పోరాటాలు చేస్తోందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

సమావేశంలో బీజేపీ నేతలు రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, ఎరుకుల రఘునారెడ్డి, సుమన్ కత్రి, బైరి శ్యాంసుందర్, ఆడెపు వెంకటేష్, బైరి మురళీకృష్ణ, ఓంప్రకాశ్, కోలారియా, చిలువేరు, రాజేందర్, నాగరాజు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'మెపా' మండల అధ్యక్షుడిగా రవి



కాజీపేట: కాజీపేట మండల ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కనుకుంట్ల రవి ముదిరాజ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నూనె శివకుమార్, ఉపాధ్యక్షులుగా సుంచు శేషాద్రి, సుంచు రఘునాథ్, రావుల నిఖిల్, కార్యదర్శులుగా సుంచు రాజు, శీలం రమేష్, గోనెల శ్యాం, గౌరవ సలహాదారులుగా రావుల కుమారస్వామితో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్, భూమ భిక్షపతి వ్యవహరించారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మర్రి కొమురారెడ్డి



కాజీపేట అర్బన్: గ్రామీణ తపాలా ఉద్యోగుల తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మర్రి కొమురారెడ్డిని సంఘం నాయకులు ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల రాష్ట్ర 4వ ద్వైవార్షిక మహాసభల్లో సంఘం నాయకులు, సభ్యులు కొమురారెడ్డిని ఎన్నుకున్నారు.

సన్మానం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్‌ను రంగశాయిపేట యూత్ ఫోర్స్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వారు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

'నీతి కథల' విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కథ చెబుతావా ఊ కొడతాం' నీతి కథల పోటీల్లో భాగంగా హనుమకొండ గోపాలపూర్ రోడ్డులోని శశికళ ఉన్నత పాఠశాలలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సోమవారం నీతికథల పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో 6నుంచి 10వ తరగతి లోపు విద్యార్థులు ఎస్‌సీహెచ్ శ్రీకీర్తికి (షైన్ హైస్కూల్) ప్రథమ బహుమతి, సమీరా (శశికళ హైస్కూల్) ద్వితీయ, ఆర్.మోదిత (శ్రీచైతన్య హైస్కూల్) తృతీయ, జూనియర్ విభాగంలో త్రష్యశ్రీ (మాస్టర్‌జీ హైస్కూల్) ప్రథమ, లాలిత్య (శశికళ హైస్కూల్) ద్వితీయ, లాస్య (బిట్స్ హైస్కూల్ పరకాల) తృతీయ బహుమతి గెలుచుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు కార్యక్రమ నిర్వాహకులు టీటీడీ డీపీపీ జిల్లా కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెన్నేటి మురళీ మనోహర్, వసుంధర, దయాకర్‌స్వామి, మచ్చమ్మ, సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఉద్యోగుల రాస్తారోకో

హసన్‌పర్తి: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ ఉద్యోగులు రాస్తారోకో నిర్వహించారు. హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి మండల కార్యాలయం ఎదుట కొనసాగుతున్న దీక్షకు ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల నాయకులు సోమవారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిల్ కలెక్టర్లు, కారోబార్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. 19న ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం, 20న కుటుంబ సభ్యులతో సమ్మె తీవ్రతరం, 21న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుక్కయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి చాతళ్ల సదానందం, సీఐటీయూ హసన్‌పర్తి మండల కార్యదర్శి అశోక్, గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా ఇన్‌చార్జ్ శివ, మండల అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జీపీ ఉద్యోగులు

1న ప్రపంచ ఆటోడ్రైవర్ల దినోత్సవం



మాట్లాడుతున్న ఇమ్మడి రాజు

నయీంనగర్: ఆగస్టు 1న ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తాడు ప్రతినిధి ఇమ్మడి రాజు పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.1000 కోట్లతో ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మంత్రి తన్నీరు హరీష్‌రావు మాట ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచిందని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 6లక్షల మంది ఆటో డ్రైవర్లు ఆటోనే జీవనాధారం చేసుకొని జీవిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు దార సూరి, అకినపెల్లి అంజయ్య, గొని రాజు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: సోమవారం ఆషాఢ బహుళ అమావాస్య సందర్భంగా కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మెట్టుగుట్టపై అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాముడి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా రామాలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం యాగశాలలో మూలమంత్ర హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు కుమారస్వామి, చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, బుర్ర సంధ్యారాణి, ఒర్సు రాజు, పెద్ది ప్రభాకర్, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మెట్టుగుట్టపై అభిషేకం చేస్తున్న భక్తులు

సంక్షిప్తంగా

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



కాజీపేట: రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ తెలిపారు. కాజీపేట పట్టణంలో రైల్వే పెన్షనర్స్ కార్యాలయంలో 40వ పెన్షనర్స్ దినోత్సవ వేడుకలను సోమవారం ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు కె.సంగమయ్య అధ్యక్షత వహించగా, సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ.రావు వార్షిక నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో కోశాధికారి కె.అయిలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బీ.యాదయ్య, ఎస్.రాములు, ఎం.అయిలయ్య, బీ.వెంకటేశ్వర్లు, ఎండీ.జహంగీర్, డీ.సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి పాటుపడుతా

వరంగల్: సీకేఎం కళాశాల అభివృద్ధికి చేయూతనందిస్తానని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. సీకేఎం కళాశాలను ఆయన సోమవారం సందర్శించి కళాశాల వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ చందా కాంతయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీకేఎం కళాశాలను ప్రభుత్వపరం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే చెప్పారు.

క్రీడాకారుడికి ఎల్‌ఓసీ అందజేత

ఖిలా వరంగల్: తూర్పుకోటకు చెందిన గంగరబోయిన శ్రీనివాస్ కుమారుడు గంగరబోయిన శివకుమార్ ఫుట్‌బాల్‌లో నేషనల్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడు. శివకుమార్ మోకాలికి గాయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష విలువగల ఎల్‌ఓసీ పత్రాన్ని ఫోర్ట్‌రోడ్డు పెరికవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శివకుమార్‌కు ఎమ్మెల్యే నరేందర్ సోమవారం అందజేశారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ పూర్ణాచారికి నివాళి

ఖిలా వరంగల్: వరంగల్ శ్రీసాయినగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ యదులాపురం అంద్రపూర్ణచారి (84) అనారోగ్య సమస్యలతో సోమవారం మృతి చెందాడు. ఈమేరకు పూర్ణాచారి మృతదేహాన్ని కాలనీ అధ్యక్షుడు రామానుజన్ జగదీశ్వర్‌స్వామి, మెంతుల వెంకటేశ్వర్లు, అనుమాండ్ల రమేష్, 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్, నరసింహచారి, గజ్జల సత్యనారాయణ, బండారు సోయ్య, కృష్ణమూర్తి, పాడిశెట్టి శ్రీనివాస్, చందర్, నవీన్, సాంబమూర్తి సందర్శించి నివాళులర్పించారు.

ఏఆర్ రిటైర్డ్ ఎస్సై మృతి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్ ఏఆర్ రిటైర్డ్ ఎస్సై ఎండీ.వలి (76) సోమవారం తెల్లవారు జామున అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పెన్షన్‌పురంలోని స్వగృహంలో టీఎస్‌ఎస్పీ రిటైర్డ్ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు చెలిమల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి సోమవారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో ఎంఏ.జాఫర్, ఎండీ.సర్వర్, ఖాజా, మధు, లబాన్, సాల్మాన్‌రాజు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి జయంతి



హసన్‌పర్తి: చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను దేవాంగుల కుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, దేవాంగుల కుల సంఘం అధ్యక్షుడు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి నాగుల నాగేందర్, సభ్యులు నాగుల చంద్రమౌళి, రెబ్బ రాజశేఖర్ పాల్గొన్నారు.

లాటరీ పేరుతో మోసం

వరంగల్: వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలో లాటరీ పేరుతో పలువురిని మోసం చేసిన ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ఉబ్బిడి నవీన్, ఉబ్బిడి నర్సయ్య, ఉబ్బిడి పోశమ్మలు ఏనుమాముల ప్రాంతంలో లాటరీలు నిర్వహిస్తూ తక్కువ విలువగల వస్తువులు ఇస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. వారి నుంచి నాలుగు స్పీకర్ బాక్సులు, 3 డీవీడీలు, 2 పెద్ద స్పీకర్ బాక్సులు, 13 ప్లాస్టిక్ వస్తువులతో పాటు రూ.5,300ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మంత్రి దయాకర్‌రావుకు సన్మానం



హన్మకొండ అర్బన్: మంత్రి, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు



వరంగల్ అర్బన్: మంత్రికి మొక్క అందజేస్తున్న మేయర్ సుధారాణి

హన్మకొండ అర్బన్: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌లను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అమెరికాలోని తానా సభల్లో పాల్గొని వచ్చిన సందర్భంగా మంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి ఉద్యోగుల సమస్యలపై విన్నవించారు. టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన కడిపికొండ స్థలాలకు సంబంధించిన విషయాలను దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, నాయకులు లక్ష్మీప్రసాద్, ఆకుల రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాంప్రసాద్, రాజు, శ్రీనివాస్, అనూప్, భరత్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన మేయర్

వరంగల్ అర్బన్: అమెరికా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని వరంగల్ విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును మంత్రి క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ గుండు సుధారాణి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

దయాకర్‌రావును కలిసిన కర్నె రవీందర్

ఖిలా వరంగల్: ఇటీవల అమెరికా పర్యటనను ముగించుకుని వరంగల్ చేరుకున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారికి ఎన్‌పీడీసీఎల్ సీఎండీ పూజలు



సీఎండీ గోపాల్‌రావు దంపతులకు మహాదాశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు దంపతులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం, మహాదాశీర్వచనం చేశారు. ముందుగా సీఎండీ దంపతులు ఆది శంకరులు, వల్లభ గణపతిని దర్శించి అమ్మవారికి పూజలు చేశారు.